వైఎస్ఆర్
కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
శనివారం 06 జూన్ 2026

## రెండు జాతీయ అవార్డులు

**ఎడ్యుకేషన్ జూన్ 5 ప్రభాతవార్త :**




నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఆంధ్రప్రదేశ్ న్యూఢిల్లీలో నిర్వహించిన ISDA ఇన్ఫ్రాకాన్ నేషనల్ అవార్డ్స్ 2026లో రెండు ప్రతిష్టాత్మక జాతీయ అవార్డులను అందుకుంది. NAC-AP డైరెక్టర్ జనరల్ జి. గణేష్ కుమార్‌కు ప్రభుత్వ సేవల్లో విశిష్ట కృషికిగాను గోల్డ్ అవార్డు లభించగా, నిర్మాణ రంగంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకుగాను NAC-APకు ప్లాటినం అవార్డు దక్కింది. న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎంపీ డా. దినేష్ శర్మ అవార్డులను ప్రదానం చేశారు. NAC-AP తరఫున అడిషనల్ డైరెక్టర్ జనరల్ డి. మనోహర్, డైరెక్టర్ ఎం. ఇంద్ర కిరణ్ అవార్డులను స్వీకరించారు. నిర్మాణ రంగానికి అవసరమైన నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పనలో NAC-AP చేస్తున్న కృషికి ఈ జాతీయ గుర్తింపు లభించింది.

## ఘనంగా ప్రారంభమైన శ్రీ మారెమ్మ తల్లి జాతర

**నందలూరు, జూన్ 5 ప్రభాతవార్త :**



మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ మారెమ్మ తల్లి జాతర శుక్రవారం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ప్రారంభమైంది. జాతర సందర్భంగా ఉదయం ఆలయంలో మహాగణపతి పూజ, స్వస్తి వాచనం, ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం గంగమ్మ తల్లి, సత్తెమ్మ తల్లి, మారెమ్మ తల్లికి 101 టెంకాయలతో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టగా, సాయంత్రం సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. జాతర వేడుకల్లో గ్రామస్తులు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు సాయంత్రం శ్రీ మారెమ్మ తల్లి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు జాతర నిర్వాహకులు తెలిపారు.

## రుతుపవనాల ప్రభావంతో మారిన వాతావరణం




జాతీయ రహదారి లో బోయినపల్లె వద్ద మేఘావృతమైన ఆకాశం

**రాజంపేట, జూన్ 5 ప్రభాతవార్త**

మండుటెండలతో విలవిల్లాడిన జనం ఒక్కసారిగా నైరుతి రుతుపవనాలు ప్రభావంతో వాతావరణం మారడంతో ఊపిరిపీల్చుకుంటున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఉష్ణోగ్రతలు ఒకసారిగా మారాయి. 42 ,43 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా 38 కి పడిపోయాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతమైంది. పడమటి గాలులు వీచాయి. దీంతో జనం చల్లని గాలులతో సేద తీరారు. పలుచోట్ల జల్లులు కూడా పడ్డాయి. నేడు రాయలసీమలోకి కూడా నైరుతి రుతుపవనాలు ప్రవేశించనునట్లు ఇప్పటికే వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో అన్నదాతలు తొలకరి జల్లుల కోసం వేచి చూస్తున్నారు.

## సైకిల్‌పై పర్యటించిన మంత్రి

**రాయచోటి జూన్ 5 ప్రభాతవార్త**

పర్యావరణ పరిరక్షణకు మద్దతుగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం సైకిల్‌పై పర్యటించారు. ఫ్రైడే నో వెహికల్ డే సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రాయచోటిలో సైకిల్‌పై పర్యటించారు. వాహనాల వినియోగాన్ని తగ్గించడం ద్వారా కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. ప్రజలు సైతం వీలైనంత వరకు సైకిళ్లు, ప్రజా రవాణా సేవలను వినియోగించి పచ్చదన పరిరక్షణకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.



## స్మార్ట్ కిచెన్ పనుల పరిశీలన



**సిద్ధవటం జూన్ 5 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన సిద్ధవటం లో నూతనంగా నిర్మిస్తున్న స్మార్ట్ కిచెన్ పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ కిచెన్ భవనానికి చుట్టూ ప్రహరీ గోడకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు స్మార్ట్ కిచెన్ భవనం ప్రక్కన ఉన్న పాత బిల్డింగ్ పూర్తిగా తొలగింపు చేపట్టాలని ఆదేశించారు పనులు త్వరగా చేసి అందుబాటులోకి తీసుకొని రావాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ విజయ్ కుమార్ పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గురు ప్రసాద్, ఏవో సోమశేఖర్ మాజీ సర్పంచ్ భవనాసి ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు మండల ఎస్ఐ హారిక ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ప్రజాదర్బారులో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

**టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు**

**రాజంపేట, జూన్ 5 ప్రభాతవార్త**



మహిళల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జగన్మోహన్ రాజు

కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని చమర్తి నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చిన మహిళల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలియజేశారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తూ, సంబంధిత శాఖల అధికారులకు వెంటనే చర్యలు తీసుకుని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సంజీవరావు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మానవాళి బాధ్యత



**నందలూరు, జూన్ 5 ప్రభాతవార్త :**

పర్యావరణ పరిరక్షణ ప్రతి మనిషి బాధ్యత అని విశ్రాంత రైల్వే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బచ్చు జయభాస్కరరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నందలూరు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కన్యక చెరువు గట్టుపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనం పెంపొందించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చన్నారు. కాలుష్యాన్ని తగ్గించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గతంలో నాటిన మొక్కలు ప్రస్తుతం పెరిగి పచ్చదనాన్ని అందించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఎస్సై మన్నెం రామమోహన్ మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షిస్తే అదే మానవాళికి రక్షగా నిలుస్తుందని అన్నారు. ప్రతి ఏడాది మొక్కలు నాటి వాటిని సంరక్షించడంతో పాటు మరిన్ని మొక్కలు నాటేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. ప్రకృతికి మేలు చేసే మర్రి, రావి వంటి వృక్షాలను పెంపొందించాల్సిన అవసరం ఉదన్నారు. పర్యావరణ పరిరక్షణ అంటే భవిష్యత్ తరాల భద్రత అని, ఈ భావనను విద్యార్థుల్లో పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. హరిత గ్రామాల సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్ కుర్రా మణియాదవ్, నీటి సంఘం అధ్యక్షుడు బూసెట్టి వెంకటసుబ్బయ్య, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పుశెట్టి సుధీర్, మోడపోతుల రాము, జంగంశెట్టి హరి, గంధం గంగాధర్, తీగలకుంట వెంకటేష్, పొనబోయిన శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అక్రమాలపై ప్రశ్నించినందుకే

## చంపుతామని బెదిరింపు లేఖలు

**ఇలాంటి బెదిరింపులకు అవినీతి పై ప్రశ్నించడంలో వెనకడుగు వేయను**

**మాజీ టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ జి వీరప్రవీణ్ కుమార్ రెడ్డి**

**ప్రొద్దుటూరు జూన్ 5 ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ప్రశ్నిస్తున్నందుకే తనపై చంపుతామంగా బెదిరించి లేఖలు వస్తున్నాయని, ప్రజల కోసం ప్రశ్నించడంలో ఇలాంటి బెదిరింపులకు తాను వెనకడుగు వేయరని మాజీ టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ జి వీర ప్రవీణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నాలుగు రోజుల క్రితం స్పీడు పోస్టు ద్వారా తన అబ్బ పెద్ద వీరారెడ్డి హత్య చేసిన విధంగా తనను కూడా హత్య చేస్తామని స్పీడు పోస్టు ద్వారా వచ్చిన బెదిరింపు లేఖలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా ఎస్ ఎస్ మాల్ అవినీతి టౌన్ బ్యాక్ అక్రమాలపై ఎలా ప్రశ్నిస్తామని నువ్వు ప్రశ్నించే వారు ఇప్పటికే ఎమ్మెల్యేలుగా పని చేశారని మరొకసారి దాడులు తప్పవని సదరులేఖలో పొందుపరిచినట్లు ఆయన వివరించారు. అలాగే తన అనుచరుడైన చంద్ర ఇటీవల జరిగిన శనగల కొనుగోలులో అవినీతిపై ఆర్.టి యాక్ట్ పెట్టిన నేపథ్యంలో అతని పై కూడా బెదిరింపు లేఖలు వచ్చాయని తెలిపారు. ఇలాంటి చౌకబారు బెదిరింపులకు తాను భయపడేది లేదని ప్రొద్దుటూరు అభివృద్ధి ప్రజల సంక్షేమం కోసం నిత్యం అవినీతి అక్రమాలపై మరింత ప్రశ్నిస్తూనే ఉంటానని తెలిపారు ఎట్టి పరిస్థితుల్లోనైనా ఆ జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు ఇలాంటి బెదిరింపు లేఖలు పంపేవారు ధైర్యంగా ముందుకు రావాలని కోరారు ఈ వ్యవహారంపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశానని త్వరలోనే అన్ని విషయాలు బయటకు వస్తాయని తెలిపారు ఏమైనా ప్రజల పక్షాన నిత్యం ప్రశ్నిస్తూనే ఉంటానని ప్రవీణ్ రెడ్డి పునరుద్ఘాటించారు.

**పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే**

## మొక్కలు నాటడం తప్పనిసరి - ఎమ్మెల్యే

**ప్రొద్దుటూరు, జూన్ 5, ప్రభాతవార్త**

దేశంలో పర్యావరణాన్ని సంరక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ప్రొద్దుటూరు రేంజ్ పరిధిలోని రాజీవ్ గాంధీ నేషనల్ పార్క్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెద్దవయ్యే వరకు సంరక్షిస్తేనే పచ్చదనం పెరుగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుత కాలంలో వాతావరణ మార్పులు, కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో పచ్చదనం పెంపొందించడం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటే అలవాటు చేసుకోవాలని, నాటిన మొక్కలను సంరక్షించడం ద్వారా మాత్రమే వాటి ప్రయోజనం సార్థకం అవుతుందని తెలిపారు. పాఠశాలలు, యువత, ప్రజలు అందరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని, అటవీ సంపదను కాపాడుకోవడం ద్వారా జీవ వైవిధ్యాన్ని రక్షించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ సబ్ డీఎఫ్ఓ సంకేత్ సునీల్ గరుడ్, అటవీ రేంజ్ అధికారి హేమాంజలి, అటవీ డిప్యూటీ రేంజ్ అధికారి లక్ష్మీ కుమారి, సోములవారిపల్లె మాజీ సర్పంచ్ సాంబశివుడు, అటవీ శాఖ సిబ్బంది, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో సందర్శకులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణే మనందరి బాధ్యత



పర్యావరణం పరిరక్షణ గురించి మాట్లాడుతున్న బిటెక్ రవి

**పులివెందుల, జూన్ 5, ప్రభాతవార్త :**

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్క రించుకుని నిర్వహించిన కార్యక్రమంలో పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి పాల్గొని పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో తదితర అధికారులతో కలిసి జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఇటీవల అమరావతిలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించినట్లుగా, స్థానికంగా చిన్న చిన్న పనుల కోసం ఎలక్ట్రిక్ సైకిళ్లను వినియోగించడం ద్వారా పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా వ్యక్తిగత ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని తెలిపారు. డీజిల్ వినియోగం తగ్గడం వల్ల దేశ విదేశీ మారకద్రవ్య నిల్వలపై కూడా సానుకూల ప్రభావం ఉంటుందని చెప్పారు. ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో తాను టీడీపీ కార్యాలయం నుంచి న్యాక్ బిల్డింగ్ సమీపంలోని విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం వరకు సైకిల్‌పై ప్రయాణించానని 2వ పేజీలో

## భూ సమస్యలను పరిష్కరించేందుకే ఒక నెల ఒక నియోజకవర్గం

**బద్వేలు అర్బన్ , జూన్ 5, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన "ఒక నెల – ఒక నియోజకవర్గం – నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా బద్వేల్ పట్టణంలోని రాఘవేంద్ర గ్రాండ్‌లో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. బద్వేల్ ప్రాంతంలో ప్రభుత్వ, డీకేటీ భూములు అధికంగా ఉండటంతో భూ సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ చెరుకూరు శ్రీధర్, జాయింట్ కలెక్టర్ నిధి మీనన్, బద్వేల్ ఆర్డీవో చంద్ర మోహన్ పాల్గొన్నారు. నాలుగు వారాల వ్యవధిలో నమోదైన ఫిర్యాదులను పరిష్కరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 200కు పైగా రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులు నమోదయ్యాయని, వాటిని వచ్చే మూడు వారాల్లో పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఖాజీపేటలో విషాదం

**నీటి గుంతలో పడి అక్కాచెల్లెళ్లు దుర్మరణం**

**రాజంపేట, జూన్ 5 ప్రభాతవార్త**



బాలికను ఒడ్డుకు చేర్చి బతికించే ప్రయత్నం చేస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన ఖాజీపేట సమీపంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. తల్లిదండ్రులకు తోడుగా వెళ్లిన ఇద్దరూ అమ్మాయిలు నీటి కుంటలో పడి దుర్మరణం చెందారు. దీంతో ఖాజీపేటలో విషాదం నెలకొంది. వివరాల్లోకెళ్తే... పందుల పెంపకమే జీవనాధారంగా బతికే శివవాణి, తమ్ముళ్ల గౌతమ్, కార్తీక్‌లతో కలిసి పందులను మేపేందుకు సంజన, అర్చన గ్రామ శివారులోని నీటి గుంత వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు వనం సంజన (18), వనం అర్చన (14) అనే అక్కాచెల్లెళ్లు నీటి గుంతలో పడి మృతి చెందారు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానికులకు తెలియజేశారు. అక్కడికి చేరుకున్న స్థానికులు ఇద్దరినీ అక్కచెల్లెళ్లను వెలికి తీశారు. ఒడ్డుకు చేర్చి బతికించే ప్రయత్నం చేశారు. అప్పటికే వారు మరణించినట్లు తెలుస్తోంది. దీంతో దుంపలగట్టులో విషాదం నెలకొంది. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**వేంపల్లె, జూన్ 05 ప్రభాతవార్త**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇడుపులపాయ నెమళ్ల పెంపక కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరులో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొన్న విత్తన గోళాల (సీడ్ బాల్స్) తయారీ కార్యక్రమాన్ని వేంపల్లి అటవీ రేంజ్ సిబ్బంది ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. రాష్ట్రంలో హరితావరణాన్ని విస్తరించే లక్ష్యంతో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుత వర్షాకాలంలో 2.5 కోట్ల విత్తన గోళాలను తయారు చేసి వెదజల్లే కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. జిల్లా అటవీ అధికారి వినీత్ కుమార్, ఐఎఫ్ఎస్ ఆదేశాల మేరకు వేంపల్లి రేంజ్‌కు నిర్దేశించిన 1.5 లక్షల విత్తన గోళాల తయారీ లక్ష్య సాధనకు రేంజ్ సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే సుమారు 20 వేల విత్తన గోళాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన వృక్షారోపణ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డా. రవీంద్రనాథ్ రెడ్డి, వెటర్నరీ వైద్యుడు డా. సాదిక్ బాషా, ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీప్రియ, అటవీ రేంజ్ అధికారి పి. బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. విత్తన గోళాల తయారీలో రేంజ్ సిబ్బంది చేస్తున్న కృషిని అతిథులు అభినందించారు. రాష్ట్రంలో హరితావరణాన్ని 50 శాతానికి పెంచే లక్ష్య సాధనకు తమ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి పి.వి. సుబ్బయ్య, అటవీ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు, వీఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.



## రైతుల ఆత్మహత్యలపై విచారణ

**కడప ఆర్డీఓ, రాజంపేట ఏఎస్పీ**



**సిద్ధవటం జూన్ 5 ప్రభాతవార్త**

సిద్ధవటం మండలంలోని దేగనవాండ్లపల్లె గ్రామానికి చెందిన నిమ్మకాయల. నాగేందర్ రెడ్డి (35), ఆయన భార్య నిమ్మకాయల. పుష్పవాణి (30) లు ఆత్మహత్యలకు పాల్పడంతో శుక్రవారం విచారణ చేపట్టినట్లు కడప ఆర్డీఓ మురళి, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది జూన్ 10వ తేదీన తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ 2 లో

# ఆశా కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలి

ఆశ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి : ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శ్రీరాములు




**మైదుకూరు, జూన్ 05, ప్రభాతవార్త:**
ఆశా కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలంటూ మైదుకూరు పట్టణ తహసిల్దార్ కార్యాలయం దగ్గర నిరసన తెలియజేశారు. నిరసన కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పివి రమణమ్మ, ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శ్రీరాములు మాట్లాడుతూ ఆశా వర్కర్స్ ని ప్రభుత్వ కార్మికులుగా గుర్తించడంతోపాటు కనీస వేతనం 26 వేల రూపాయలు పెంచాలని,ఇన్సూరెన్స్ పది లక్షల రూపాయలు కల్పిస్తూ ఏఎన్ఎం జీఎన్ఎమ్ శిక్షణ పూర్తి చేసిన ఆశాలకు వెయిటేజ్ మార్కులు కలుపుతూ ఆశాలు మరణిస్తే మట్టి ఖర్చుల కింద 15,000 వేల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు నాణ్యమైన యూనిఫాం 5జి సిమ్ము మొబైల్ తోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు కల్పించాలని లేబర్ కోడ్ రద్దు చేసి ఆశాలకు పేస్ రికగ్నేషన్,నెలవారి గర్భవతుల టార్గెట్లు ఉపసంహరించుకోవాలని పై డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్. మున్వార్ పి.విజయలక్ష్మి ఎస్ . హాసీనమధుమతి దోరతి పెర్సి వరాలు తదితరులు పాల్గొన్నారు.

# మానవ మానగడలో వృక్షాలది కీలకపాత్ర

**బద్వేలు అర్బన్,జూన్ 5, ప్రభాతవార్త**
ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బద్వేలు పట్టణంలోని మైదుకూరు రోడ్డు నుంచి గుంతపల్లె వెళ్లే రహదారి వెంబడి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ ప్రేమికులు, బద్వేల్ పట్టణ అభివృద్ధి సొసైటీ సలహాదారు పెద్దిరెడ్డి సతీష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నశీం అలీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెట్లను నరికి వేయడం భవిష్యత్ తరాలకు ప్రమాదకరమని అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పట్టణ అభివృద్ధి సొసైటీ ప్రధాన కార్యదర్శి గురుమూర్తి, ఉపాధ్యక్షుడు ఎస్.ఎ. సత్తార్ మాట్లాడుతూ బద్వేల్ పట్టణ పరిధిలో 10 వేల మొక్కలు నాటే లక్ష్యంతో పనిచేస్తున్న పర్యావరణ ప్రేమికులు పెద్దిరెడ్డి సతీష్ కుమార్ రెడ్డి సేవలు అభినందనీయమన్నారు.
పర్యావరణం మానవాళికి లభించిన అమూల్యమైన సంపద అని, దానిని భావితరాలకు భద్రంగా అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జె. శ్రీనివాసులు, జి. నాగార్జున, బి. బాలగురన్న, రసూల్, వి. కిరణ్ కుమార్, రజనీష్, శ్రీనివాస రాజు, షేక్ అన్వర్ బాషతో పాటు అటవీ శాఖ సిబ్బంది మరియు పలువురు పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి టిడిపి



**వేంపల్లె: జూన్ 05 ప్రభాతవార్త**
ప్రజా సమస్యలపై దృష్టి సారించి, వీటి పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ బిటెక్ రవి అన్నారు. శుక్రవారం స్థానిక పులివెందుల పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. వేంపల్లె మండలానికి చెందిన ఆ పార్టీ కన్వీనర్ రామమునిరెడ్డి, బిటెక్ రవిని కలిశారు. అనంతరం ఓటర్ వెరిఫికేషన్ కి సంబంధించి ఆయా ప్రాంతాల్లోని ప్రతి బూత్ కు విఆర్ఓ లను ప్రభుత్వం కేటాయించిందని, బూత్ ఏజెంట్లు కూడా సంబంధిత విఆర్ఓ లతో మాట్లాడి ఓటర్ లిస్ట్ లో పాల్గొన్నాలని బిటెక్ రవి సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమిష్టి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ వైస్ ప్రెసిడెంట్ వీరభద్ర మరియు క్లస్టర్ ఇంచార్జి షేక్ మొహమ్మద్ ఇంచార్జి దక్కా రమేష్ బాబు మొదలగు వారూ పాల్గొన్నారు.

# కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి



కార్యకర్త షామీర్ ను పరామర్శిస్తున్న బిటెక్ రవి

**పులివెందుల, జూన్ 5, ప్రభాతవార్త :**
పులివెందుల మున్సిపాలిటీకి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త షేక్ షామిర్ బాష తండ్రి గుండెపోటుతో మృతి చెందడం పట్ల ఎమ్మెల్సీ బీటెక్ రవి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతుడికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి నివాసానికి వెళ్లిన బీటెక్ రవి, షామీర్ బాషతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ విషాద సమయంలో పార్టీ పరంగా, వ్యక్తిగతంగా తమ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కుటుంబం ఈ కష్టకాలాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని ఆకాంక్షించారు.మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అక్కులగారి విజయ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర హజ్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మహబూబ్ బాష, తుమ్మలపల్లె ఎంపీటీసీ విశ్వనాథ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి (ఎర్ర జగదీష్) తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సదస్సులో డా. ఆర్. నాగరాజుకు అరుదైన గౌరవం

అవుట్‌స్టాండింగ్ రీసెర్చ్ కాంట్రిబ్యూషన్ అవార్డు"తో సత్కారం

ఉద్యాన పరిశోధన, బోధన, విస్తరణ సేవలకు అంతర్జాతీయ గుర్తింపు



అంతర్జాతీయ అవార్డు అందుకుంటున్న డాక్టర్ నాగరాజు

**పులివెందుల, జూన్ 5, ప్రభాతవార్త :**
డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ఉద్యాన కళాశాల, పులివెందుల అసోసియేట్ డీన్ డా. ఆర్. నాగరాజు అంతర్జాతీయ స్థాయిలో మరో ప్రతిష్ఠాత్మక గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జూన్ 5న నిర్వహించిన అంతర్జా తీయ సదస్సులో అగ్రికల్చర్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సొసైటీ ఘజియాబాద్ ఆధ్వర్యంలో ఆయనకు "అవుట్‌స్టాండింగ్ రీసెర్చ్ కాంట్రిబ్యూషన్ అవార్డు" ప్రదానం చేశారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం సహకారంతో ఏఐటీ కాన్ఫరెన్స్ సెంటర్‌లో జరిగిన ఈ సదస్సులో ఉద్యాన విజ్ఞాన రంగంలో పరిశోధన, బోధన, విస్తరణ సేవలు మరియు సాంకేతిక పరిజ్ఞాన బదిలీలో డా. నాగరాజు అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు.గత రెండు దశాబ్దాలుగా ఉద్యాన పంటల పరిశోధనలో విశేష కృషి చేస్తున్న డా. నాగరాజు సంరక్షిత సాగు (ప్రొటెక్టెడ్ కల్టివేషన్), పుష్పకృషి, డ్రై ఫ్లవర్ టెక్నాలజీ, నర్సరీ నిర్వహణ, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి, స్థిరమైన ఉద్యాన సాగు విధానాలపై అనేక పరిశోధనలు నిర్వహించారు. ఆయన ఆధ్వర్యంలో పలు పరిశోధన ప్రాజెక్టులు విజయవంతమవడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి శాస్త్రీయ జర్నల్స్‌లో అనేక పరిశోధనా వ్యాసాలు ప్రచురితమ య్యాయి. పుష్పాల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, డ్రై ఫ్లవర్ టెక్నాలజీ, అలంకార మొక్కల వాణిజ్యీకరణ, సంరక్షిత సాగు సాంకేతికతల విస్తరణలో ఆయన చేసిన కృషి రైతులు, యువ పారిశ్రామికవేత్తలు, విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతోంది. రైతులు, గ్రామీణ యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉద్యాన రంగంలో స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించ డంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. పరిశోధన, బోధన, విస్తరణ సేవలలో ఆయన చూపిన ప్రతిభకు గుర్తింపుగా 2017లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ శాస్త్రవేత్త అవార్డును కూడా అందుకున్నారు. ప్రస్తుతం ఉద్యాన కళాశాల, పులివెందుల అసోసియేట్ డీన్‌గా విధులు నిర్వహిస్తూ విద్యా ప్రమాణాల పెంపు, పరిశోధనాభివృద్ధి, విద్యార్థుల సమగ్ర వికాసానికి విశేష కృషి చేస్తున్నారు.డా. నాగరాజుకు ఈ అంతర్జాతీయ పురస్కారం లభించడం పట్ల విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

సంక్షేమ పథకాల అమలుతో పాటు

# రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యం

జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్



**వేంపల్లె, జూన్ 05. ప్రభాతవార్త**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంక్షేమం-సుపరిపాలన దిశగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్ వివరించారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తుండగా, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతు కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వ పీఎంకిసాన్ సాయంతో కలిపి సంవత్సరానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు వికలాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. వృద్ధాప్య పెన్షన్‌ను రూ.4 వేలకు, వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచినట్లు తెలిపారు. దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నారని, పేదలు, కూలీల కోసం అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించి రూ.5కే నాణ్యమైన భోజనం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని దాసరి రవిశంకర్ తెలిపారు.

# తాగునీటి సమస్యకు పరిష్కారం

వార్తా కథనానికి స్పందన.




**ముద్దనూరు, జూన్ 05 (ప్రభాతవార్త):**
మండలంలోని ఉప్పులూరు పంచాయతీ పరిధిలోని చిన్న కత్తెరపల్లె గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను అధికారులు శుక్రవారం పరిష్కరించారు. ఈ నెల 2న తాగునీటి సమస్య తీవ్ర ఇబ్బందులు అనే వార్త కథనం ప్రచురితమవడంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి నూరు అహ్మద్ గ్రామాన్ని సందర్శించి సమస్యను పరిశీలించారు. తాగునీటి సరఫరా మోటార్ సాంకేతిక లోపం కారణంగా సమస్య ఏర్పడిందని గుర్తించి, మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో సమస్యకు పరిష్కారం లభించగా, గ్రామస్తులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# పాఠశాల ఎదుట పీడీఎస్‌యు ఆధ్వర్యంలో ఆందోళన

**ఎడ్యుకేషన్ మే 5 ప్రభాతవార్త :**
కడప నగరంలోని కార్పొరేట్ పాఠశాల ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న మాట్లాడుతూ, విద్య అనే సామాజిక బాధ్యతను లాభాల మార్కెట్‌గా మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో వ్యాపారం చేస్తున్న నారాయణ విద్యాసంస్థల తీరును తీవ్రంగా ఖండించారు. యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ప్రత్యేక ఫీజులు, వివిధ పేర్లతో తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు బలవంతంగా వసూలు చేస్తూ బహిరంగ దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. చదువు కోసం పిల్లలను పాఠశాలకు పంపితే తల్లిదండ్రులను అప్పుల ఊబిలోకి నెట్టే పరిస్థితిని కార్పొరేట్ విద్యాసంస్థలు సృష్టించాయని విమర్శించారు. విద్యాశాఖకు బాధ్యత వహించాల్సిన మంత్రి విద్యాసంస్థలపైనే ఫీజుల దోపిడీ, అక్రమ వసూళ్లు, బలవంతపు కొనుగోళ్ల ఆరోపణలు రావడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. కార్పొరేట్ విద్యా మాఫియాకు ప్రభుత్వం అండగా నిలుస్తోందనే అభిప్రాయం ప్రజల్లో బలపడుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీ, అక్రమ వసూళ్లు, యూనిఫాంలు మరియు పాఠ్య పుస్తకాల పేరుతో జరుగుతున్న బలవంతపు వ్యాపారాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న సందర్భంగా కడప ఎంఈఓ సిబ్బంది పెంచలయ్య, రాజు చేరుకొని పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నోటీసులు యాజమాన్యంకు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యు జిల్లా నగర నాయకులు మహేష్, గణేష్, దుర్గేష్, ఆరిఫ్, ఖాసీం, రిహాన్, చరణ్‌కుమార్, సుధీర్, లోకేష్, తారకరత్న తదితరులు పాల్గొన్నారు.




# రైతుల ఆత్మహత్యలపై విచారణ

పరిధిలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో సిద్దవటం మండలంలోని దేగనవాండ్లపల్లె గ్రామానికి చెందిన భార్య, భర్తలు ఇరువురు వ్యవసాయంలో అప్పుల బాధ వలన పురుగుల మందు తాగి ఆత్మహత్య కు పాల్పడి మృతి చెందడం జరిగిందన్నారు. రైతుల ఆత్మహత్యల గురించి, వారి ఆర్థిక పరిస్థితి గురించి విచారణలో భాగంగా త్రిమెన్ కమిటీ మండల స్థాయిలో తహసీల్దార్, ఎస్సై, అగ్రికల్చర్ ఏఓ విచారించి నివేదిక సమర్పించడం జరిగిందన్నారు. ఈ మేరకు డివిజన్ స్థాయిలో ఆర్డీఓ, ఏఎస్పీ, ఏడిఏ అగ్రికల్చర్ వెంకట సుబ్బయ్య తో కలిసి విచారించడం జరిగిందన్నారు. మృతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తెలు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాదవిలత, సిద్ధవటం ఎస్సై హారిక, అగ్రికల్చర్ ఆఫీసర్ రమేష్ రెడ్డి లు పాల్గొన్నారు.

# తహసిల్దార్‌గా బి.వేణుగోపాల్



**సుండుపల్లె. జూన్ 05,ప్రభాతవార్త :**
సుండుపల్లె మండల నూతన తహసిల్దార్‌గా బి. వేణుగోపాల్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో పదవీ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకమైన సేవలు అందిస్తానని తెలిపారు. నూతన తహసిల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ వినీత్ కుమార్ రెడ్డి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ జోతిర్మయి, విఆర్ఓలు రమణ, బసప్ప, నరసింహులు పలువురు అధికారులు, స్థానిక నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు.

# జనజాతీయ గరిమా ఉత్సవ్ కార్యక్రమం



**సుండుపల్లె, జూన్ 05,ప్రభాతవార్త :**
మండల పరిధిలోని ముదుపాడు గ్రామం ఆరోగ్యపురంకు చెందిన ఏం.అమ్మనాయక్ కుమారుడు డా. ఎం. వినాయక్, ప్రస్తుతం ఆదిత్య యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఢిల్లీలో నిర్వహించనున్న "జనజాతీయ గరిమా ఉత్సవ్" కార్యక్రమంలో భాగంగా భారత రాష్ట్రపతి గారితో జరిగే ప్రత్యేక సమావేశానికి ఎంపికయ్యారు.ఆయన ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్.డి పూర్తి చేశారు. విద్యా, పరిశోధన రంగాల్లో ఆయన సాధించిన విజయాలను గుర్తించి ఈ అరుదైన అవకాశానికి ఎంపిక చేయడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అలంకరిస్తున్న భారత రాష్ట్రపతితో ప్రత్యక్షంగా సమావేశమయ్యే అవకాశం లభించడం తనకు ఎంతో గౌరవంగా మరియు జీవితంలో మరపురాని ఘట్టంగా భావిస్తున్నానని తెలిపారు. యువత ఉన్నత విద్యను అభ్యసించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన ఆకాంక్షించారు.ఆయన సాధించిన ఈ ఘనతపై కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచర అధ్యాపకులు మరియు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

# పర్యావరణ దినోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీ..

**సుండుపల్లె, జూన్ 05, ప్రభాతవార్త :**
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల టౌన్ వీధుల్లో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో రాజంపేటపాల్గొన్న పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు మరియు టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చప్పిడి మహేష్ నాయుడు,స్థానిక టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు చప్పిడి. రమేష్ నాయుడు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సైకిల్ తొక్కుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రకృతి సంపదను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని, కాలుష్య నియంత్రణలో భాగంగా సైకిళ్ల వినియోగాన్ని పెంచాలని సూచించారు. అలాగే విద్య, సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ అంశాల్లో యువతను ముందుకు నడిపిస్తున్న మంత్రి నారా. లోకేష్ ఆలోచనలు యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ చెట్లు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్రకృతిని సంరక్షించడం వంటి చర్యలను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చార. అనంతరం రాయవరం జంగంపల్లిలో వెలసిన మరిణమ్మ ను దర్శించుకొన్నారు ఈ సందర్భంగా ప్రజలు డప్పు వాయిద్యాలు పూల మాలలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం, మహా కుంభాభిషేకం కరపత్రాల ఆవిష్కరణ

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 5, ప్రభాతవార్త :**
పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో 2026 జూన్ 16వ తేదీ మంగళవారం నుండి జూన్ 20వ తేదీ శనివారం వరకు ఐదు రోజులపాటు మహా కుంభాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ వంగల నారాయణరెడ్డి, పాలకమండలి సభ్యులు, ఆలయ అర్చకులు వెల్లడించారు. ఈ మహా కుంభాభిషేకాన్ని జగద్గురు శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి పవిత్ర హస్తాల ద్వారా నిర్వహించబడనుండటం విశేష ఆకర్షణగా నిలుస్తోంది. ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమం కారణంగా ప్రాంతమంతా భక్తి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని తెలుగు దేశం పార్టీ కార్యాలయం లో ప్రొద్దుటూరు శాసన సభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, పాలకమండలి సభ్యులు మరియు అర్చక బృందం ఎమ్మెల్యేకి ఘనంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ, మహా కుంభాభిషేకం వంటి పవిత్ర కార్యక్రమాలు ప్రాంత ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని మరింత పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. దేవస్థానం చైర్మన్ వంగల నారాయణరెడ్డి మాట్లాడుతూ, కుంభాభిషేకం సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, వేద పారాయణాలు, రుద్రాభిషేకాలు, మరియు ఆలయ శుద్ధి కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించబడతాయని తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున పార్కింగ్, క్యూలైన్లు, తాగునీరు, భద్రత వంటి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అర్చక స్వాములు మాట్లాడుతూ, ఈ మహా కుంభాభిషేకం ఆలయ పునరుజ్జీవనానికి సమానమైన పవిత్ర ఘట్టమని, వేద మంత్రోచ్ఛారణల మధ్య సంప్రదాయ పద్ధతుల్లో అన్ని క్రతువులు నిర్వహించబ డతాయని తెలిపారు. ఈ మహోత్సవానికి ప్రొద్దుటూరు పట్టణం మరియు పరిసర ప్రాంతాల భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులవ్వాలని ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు.




ఆహ్వాన పత్రిక లతో ఎమ్మెల్యే, శివాలయం ఛైర్మన్, అర్చకులు

# సిద్ధవటం తాసిల్దార్ విజయ్ కుమార్

**సిద్ధవటం, జూన్ 5 ప్రభాతవార్త**
మండల తాసిల్దార్‌గా విజయ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు ఆయన నంద్యాల జిల్లా చాకలమర్రి తాసిల్దార్‌గా విధులు నిర్వహించేవారు బదిలీల్లో భాగంగా సిద్ధవటం కు బదిలీ అయినారు సిద్ధవటంలో పనిచేస్తున్న ఆకుల తిరుమలబాబును బద్వేల్‌కు బదిలీ చేయడమైనది ఈ సందర్భంగా తాసిల్దార్ విజయ్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని భూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ప్రభుత్వ స్థలాలు రెవెన్యూ పొలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు.



# బెస్ట్ బ్యూటీషియన్ అవార్డు అందుకున్న రాధ

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 5,ప్రభాత వార్త**
హైదరాబాద్ పట్టణంలోని మోర్య ఫంక్షన్ హాల్లో సినీనటి ముమైత్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన మెగా బ్యూటీ ఫెస్టివల్ కార్యక్రమంలో సౌత్ ఇండియా వ్యాప్తంగా మహిళలు హెయిర్ అండ్ బ్యూటీషియన్ పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలో గెలిచిన అతి తక్కువ మంది విజేతలలో మొదటి విజేతగా నిలిచిన ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన హర్షిత బ్యూటీ పార్లర్ ప్రొప్రైటర్ అండ్ బ్యూటిషియన్ రాధ కు కార్యక్రమ ముఖ్య అతిథులు అయినటువంటి సినీనటి పాయల్ రాజ్ పుత్, గాయకుడు రోల్ రిడా,నటి నందిని,మాలతి శెట్టి చేతుల మీదుగా అవార్డు అందించారు. ఈ సందర్భంగా హర్షిత బ్యూటీ పార్లర్ ప్రొప్రైటర్ అండ్ బ్యూటీషియన్ రాధ మాట్లాడుతూ బ్యూటిషియన్ పోటీలో విజేతగా నిలిచి,అవార్డు తీసుకోవడం నాకు చాలా ఆనందంగా ఉందని, భవిష్యత్తులో హర్షిత బ్యూటీ పార్లర్ ద్వారా మరింత మంది మహిళలకు ఉపాధి కల్పించే విధంగా ఈ బ్యూటిషన్ కోర్స్ నేర్పించి,సమాజంలో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి నా వంతు సహకారం నేను చేస్తానని తెలిపింది.



అంగన్‌వాడీ కార్యకర్తలకు

# ఒక రోజు శిక్షణ కార్యక్రమం

**పెండ్లిమర్రి, జూన్ 5, ప్రభాతవార్త:**
పెండ్లిమర్రి మండలంలోని కేజీబీవీ పాఠశాలలో మండల్ లెవెల్ ఏఐ ఈసీడీ స్క్రీనింగ్ 0-6 సంవత్సరాల లోపు పిల్లలకు స్క్రీనింగ్ గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీడీపీవో శాంతమ్మ నవ చేతన యాప్ గురించి గర్భవతి నుంచి 2 సంవత్సరాల పిల్లల వరకు వారు చేరుకునే మైలురాళ్లు గురించి ఈసీ డీ స్క్రీనింగ్ ఎలా చేయాలని తెలిపారు. పెండ్లిమర్రి పీహెచ్‌సీలోని డాక్టర్ వెంకట ప్రసాద్ పిల్లల్లో వచ్చే డిసీజెస్ గురించి వాటిని ఎలా గుర్తించాలని ఫోర్ డీల గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2, కేజీబీవీ ప్రిన్సిపల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, సీహెచ్‌ఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణే మనందరి బాధ్యత

తెలిపారు. పార్టీ కార్యకలాపాల కోసం ఇప్పటికే 10 ఎలక్ట్రిక్ సైకిళ్లను ఆర్డర్ చేసినట్లు వెల్లడించారు.రాబోయే రెండు నుంచి మూడు సంవత్సరాల్లో పులివెందులను పూర్తిగా ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఇందుకు అధికారులు, ప్రజలు సమిష్టిగా సహకరించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో హెలిప్యాడ్ల నిర్మాణం కోసం పెద్ద ఎత్తున చెట్లను నరికివేశారని విమర్శించిన ఆయన, ప్రస్తుతం ప్రభుత్వం మొక్కల పెంపక కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ చిన్నయ్య, మున్సిపల్ అధికారులు , తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, అక్కులగారి విజయ్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ విశ్వనాథ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చంద్రవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి (వెంకీ), పుష్పగిరి స్కూల్ కరస్పాండెంట్ ఓబుల్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మార్తల జగన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, Salla SAMINI (old Name), W/o SALLA MANOHAR, R/o. D.No. 6-7-270, Bhakarapeta, Badvel, Cuddapah, PIN. 516227, AP. Changing my name from Salla SAMINI (old Name) to Salla manohar Yamuna Malkanthi (New Name). Hence forth, I am being called as SALLA MANOHAR YAMUNA MALKANTHI for all purposes.

## భూ సమస్యల పరిష్కార వేదికలో వినతి



గోపవరం, జూన్ 5, ప్రభాతవార్త.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ఒక నెల – ఒక నియోజకవర్గం – నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా బద్వేల్ నియోజకవర్గంలో నిర్వహించిన భూ సమస్యల పరిష్కార వేదికలో గోపవరం మండలానికి చెందిన రైతులు తమ భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సోమశిల ప్రాజెక్టు ముంపు ప్రాంతం నుంచి గోపవరం మండలానికి వలస వచ్చిన రైతులు బత్తలపల్లి కృష్ణారెడ్డి, సింగమల మల్లంకొండారెడ్డి గత రెండు సంవత్సరాలుగా పరిష్కారం కాని భూ వివాదాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనాకు వినతిపత్రం అందజేశారు. గోపవరం మండలంలోని తమ భూముల సమస్య పై వారు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని గతంలో కలెక్టర్, ఆర్డీఓ తదితర అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆర్డీఓ, డివిజనల్ సర్వేయర్‌లతో చర్చించారు. 813 బ్లాక్‌తో పాటు రైతుల డీకేటీ భూములను సర్వే చేసి, ఒక వారంలో హద్దులు నిర్ణయిస్తామని డివిజనల్ సర్వేయర్ హామీ ఇచ్చారు. అలాగే గతంలో జరిగిన సర్వేలకు, ప్రస్తుతం జరిగిన సర్వేలకు మధ్య సుమారు 30 అడుగుల వ్యత్యాసం ఉన్న అంశాన్ని కూడా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. సమస్య పరిష్కారానికి స్పందించిన జాయింట్ కలెక్టర్ నిధి మీనా, ఆర్డీఓ, డివిజనల్ సర్వేయర్‌లకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## పంచాయతీ ఆదాయాన్ని పెంచుటకు

# ప్రత్యేక టీం పర్యటన



రాజుపాలెం, జూన్ 5, ప్రభాతవార్త.

మండల కేంద్రంలోని రాజుపాలెం గ్రామంలో గ్రామ పంచాయతీ ఆదాయం పెంచుటకు గ్రామంలో గల రెండు ప్రైవేటు పాఠశాలల విస్తీర్ణము ఆవరణ గదులు కొలతలను శుక్రవారం ప్రత్యేక టీం అధికారులు డి ఎల్ డి వో రామాంజనేయులు ఈవోపీఆర్డీలు షాకీర్ అలీ ఖాన్, హరి పంచాయతీ కార్యదర్శులు కొలతలను కొలిచి రికార్డు చేశారు. గ్రామాల్లో పాత కొలతల ప్రకారం ట్యాక్స్ నమోదు కాకుండా కొత్తగా నిర్మించిన, ఏర్పాటుచేసిన ఇల్లు దుకాణాలు కొత్త కొలతల ప్రకారం టాక్స్ సేకరించాలని పంచాయతీ ఆదాయంలో పెంచాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు తెలిపారు.

## రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం



పెండ్లమర్రి, జూన్ 5, ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు శుక్రవారం పెండ్లిమర్రి ఎస్సై తులసీ నాగప్రసాద్ ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండల కేంద్రంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. రోడ్డు ఎనియమ నిబంధనలు తప్పక పాటించాలని ఎస్సై తులసీనాగప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## ముద్దాయికి రిమాండ్

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 5, ప్రభాతవార్త:

రాజుపాలెం మండలం టంగుటూరు గ్రామానికి చెందిన గంజికుంట నాగరాజు క్రైం నెం.64/2026 తదితర కేసుల్లో నిందితుడు. పోలీసులకు అందిన సమాచారం మేరకు గురువారం సాయంత్రం ప్రొద్దుటూరు అనిబెసెంట్ స్కూలు వద్ద టుటౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ మైనుద్దీన్ అరెస్టు చేయడం జరిగింది అతన్ని శుక్రవారం న్యాయ స్థానం ముందు హాజరుపరచగా రిమాండుకు పంపడం జరిగిందని మైనుద్దీన్ తెలిపారు. ఈ కేసులోని 2వ ముద్దాయి అయిన ఉదయగిరి శివరాం అరెస్టు కావాల్సి ఉందన్నారు.

## ఏ అధికారైన ప్రజాప్రతినిధి అయిన

## బాధ్యతగా ప్రజాసేవ చేయాలి : ఎమ్మెల్యే




రాజుపాలెం, జూన్ 5, ప్రభాతవార్త:

ఏ ప్రభుత్వ అధికారైన ప్రజా ప్రతినిధి అయిన ప్రజాసేవ కోసమే ప్రభుత్వ ప్రతినిధిగా, ప్రజా ప్రతినిధిగా విధులు బాధ్యతగా సక్రమంగా నిర్వర్తించాలని అందుకోసమే మనం ఉన్నదని స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం మండల ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు తిరిగి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు లేదన్నారు. చాలామంది అధికారులు పల్లెల్లో డ్యూటీలు చేస్తూ ఆ పల్లెల్లో ఉన్న ప్రజలు అంటే చిన్నచూపు చూడటం తగదని హెచ్చరించారు. ప్రజా సమస్యల పైన సమావేశాలు జరుగుతున్నప్పుడు బాధ్యతాయుతంగా ఉండాల్సిన అధికారులు సమావేశాలకు రాకుండా కింది స్థాయి వాళ్లను పంపడము, సెలవులు పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. త్రాగునీటి సమస్య పారిశుద్ధ్యము గ్రామాల్లో సక్రమంగా ఉండాలని తెలుపుతూ పా రిశుద్ధ్య కార్మికులకు ప్రతినెల పారితోషిక డబ్బులు చెల్లించాలని తెలిపారు. సమావేశంలో మినిట్స్ బుక్కులో మినిట్స్ రాస్తున్నారా లేదా అని ప్రశ్నించి తర్వాత సమావేశమునకు ఈ సమస్యలన్నీ రిపీట్ కాకుండా చూడాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యక్షుడు నారాయణ కల్పించుకొని సమావేశాలన్నా, ప్రజాప్రతినిధులు అన్నా సమావేశంలో వారు లేవనెత్తే సమస్యలున్న అధికారులకు నిరక్ష్యమ్లని, సమావేశాలకు హాజరు కావడం వెళ్ళటం తప్ప ఏమీ లేదన్నారు. మండల రైతుసంఘం సమాఖ్యకు ట్రాక్టర్ మంజూరైనట్లు ఏపీఎం సుజాత తెలిపారు. దీని ద్వారా రైతులు వ్యవసాయ పనులు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు వారు చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల నివేదికలను, సభ ముందు ఉంచారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు అంజలి కుమారి, ఎంపీడీవో సురేష్ బాబు, తాసిల్దార్ హరినాథ్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, పంచాయితీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో"వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన కార్యక్రమం






బద్వేలు అర్బన్, జూన్ 5, ప్రభాతవార్త:

రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బద్వేల్ నియోజకవర్గంలో శుక్రవారం"వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని బద్వేల్, అట్లూరు, గోపవరం మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ ప్రారంభించారు. బద్వేల్ పట్టణంలోని ఎన్జీవో కాలనీలో ఉన్న వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రకటించిన"సూపర్6" హామీలు రెండేళ్లు గడిచినా అమలు కాలేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సహాయం, రైతు సంక్షేమం, కొత్త పెన్షన్లు, గృహాల మంజూరు వంటి హామీలు నెరవేరలేదని ఆరోపించారు. ఎరువుల కొరత, గిట్టుబాటు ధరల సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగాల భర్తీ వంటి రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని, ఆరోగ్యశ్రీ సేవలు సక్రమంగా అందడం లేదని నాయకులు విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు అయ్యే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, రైతులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీసులపై తిరగబడినందుకే కేసు నమోదు అంటున్న పోలీసులు

పులివెందుల, జూన్ 5, ప్రభాతవార్త :

పోలీసులపై అనుచితంగా ప్రవర్తించినందుకే గోవర్ధన్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నామని అర్బన్ సిఐ శ్రీరామ్ తెలిపారు. పులివెందుల మండలం ఉల్లిమెల్ల గ్రామంలో చోటుచేసుకున్న భూ వివాదానికి సంబంధించిన వ్యవహారంపై పులివెందుల అర్బన్ సీఐ శ్రీరామ్ మీడియా సమావేశం నిర్వహించి కేసు వివరాలను వెల్లడించారు. అయితే పోలీసులు వెల్లడించిన అంశాలపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సీఐ శ్రీరామ్ తెలిపిన వివరాల ప్రకారం, ఉల్లిమెల్ల గ్రామానికి చెందిన షైక్ చాంద్ బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోవర్ధన్ రెడ్డి, ఆయన తండ్రి రవీంద్రనాథ్ రెడ్డి, అన్న పవన్ కుమార్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. భూ వివాదానికి సంబంధించిన స్థలాన్ని రెవెన్యూ అధికారులు, గ్రామ పెద్దలతో కలిసి పలుమార్లు పరిశీలించామని చెప్పారు. గ్రామంలో రహదారి కోసం కొంత స్థలం వదిలివేయాలని పెద్దలు సూచించగా చాంద్ బీ అంగీకరించి గోడ నిర్మాణ పనులు చేపట్టారని వివరించారు. ఈ క్రమంలో గోవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే గోవర్ధన్ రెడ్డిని విచారణ నిమిత్తం పిలిచేందుకు వెళ్లిన సమయంలో ఆయన పోలీసులతో అనుచితంగా ప్రవర్తించడంతో అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అయితే మీడియాకు అందజేసిన ప్రెస్‌నోట్‌లో కేసు నమోదు తేదీగా 06062026 నమోదు కావడం చర్చనీయాంశమైంది. ఈ విషయంపై పాత్రికేయులు ప్రశ్నించగా, అది సాంకేతిక పొరపాటు మాత్రమేనని సీఐ వివరణ ఇచ్చారు. మరోవైపు కేసు నమోదు చేసినట్లు చెబుతున్నప్పటికీ, సంబంధిత క్రైమ్ నెంబర్‌ను వెల్లడించకపోవడం పలు సందేహాలకు తావిస్తోంది. కేసు వివరాల్లో స్పష్టత లేకపోవడం, క్రైమ్ నెంబర్ వెల్లడించకపోవడం వంటి అంశాలపై స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ సంఘటనపై గోవర్ధన్ రెడ్డి భార్య పోలీసులు వెల్లడించిన వివరాలకు వ్యతిరేకంగా వాదనను వినిపించడంతో ఈ సంఘటనపై పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.



## పర్యావరణ పరిరక్షణ మన కర్తవ్యం. చెట్లు లేకపోతే మానవజాతి మనుగడే లేదు

వేంపల్లె జూన్ 05 ప్రభాతవార్త

చెట్లు లేకపోతే మానవజాతి మనుగడే లేదని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు వేంపల్లె లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేంపల్లి లో నారాయణ విద్యాసంస్థల ఆవరణలో సిబ్బందితో, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ, మానవులు, మానవుల చుట్టూ ఉండే పరిసరాలనే పర్యావరణ అంటారన్నారు. ఇందులో తోటి మానవులు, మొక్కలు, చెట్లు, జంతువులు, పక్షులు, క్రిమి కీటకాలు, సూక్ష్మజీవులు, గాలి, నీరు ఆకాశము, భూమి, కొండలు, గుట్టలు, సూర్యరశ్మి, ఉష్ణోగ్రత ఇవన్నీ పర్యావరణ కింద వస్తాయని తులసి రెడ్డి అన్నారు. వీటిని కాపాడుకుంటేనే మానవుడు సుఖమయమైన ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతాడు అన్నారు. మానవులు శ్వాసక్రియ ద్వారా విసర్జించిన కార్బన్ డయాక్సైడ్ ను (బొగ్గు పులుసు వాయువును )మొక్కలు, చెట్లు గ్రహించి కిరణజన్య సంయోగ క్రియ ద్వారా మానవులకు అవసరమైన ఆక్సిజన్ ను (ప్రాణవాయువును )ఉత్పత్తి చేసి మానవులకు అందిస్తున్నాయన్నారు. చెట్లు ఉత్పత్తి చేసిన ఆక్సిజన్ ఓజోన్ పొరగా ఏర్పడి సూర్యుని నుండి వెలువడే నీల లోహిత కిరణాల నుండి మానవులను కాపాడుతోంది. చెట్లు మానవులకు ఆహారం, కలప, వెదురు, బంక, ఔషధమూలికలు పండ్లు, పూలు, తేనె అందిస్తున్నాయి. పశుపక్ష్యాదులకు ఆవాసం కల్పిస్తున్నాయి. పశువులకు పశుగ్రాసం, జంతువులకు, పక్షులకు, మానవులకు నీడను అందిస్తున్నాయి. భారతీయ నాగరికత ఋషుల ద్వారా చెట్ల మధ్యన ఆవిర్భవించింది. త్రేతాయుగంలో సీతారామ లక్ష్మణులు 14 సంవత్సరాల పాటు చెట్ల మధ్య అరణ్యవాసం చేశారు. పాండవులు 12 సంవత్సరాలు చెట్ల మధ్య అరణ్యవాసం చేశారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన పెంపొందించడానికి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 1973 నుంచి జూన్ 5వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తులసిరెడ్డి అన్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని పరిరక్షించుకోవడం అంతకంటే ముఖ్యమన్నారు. చెట్లను నరకడం నేరపూరితమైన చర్య అన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం రోజు రోజుకు ఎక్కువవుతోంది. దీనిని నివారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తులసి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల ప్రిన్సిపల్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు రామ్మోహన్, గంగిరెడ్డి, విద్యా సంస్థల సిబ్బంది పెద్ద గంగిరెడ్డి, ప్రసాద్, ఆంజనేయులు, గంగిరెడ్డి, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, చాగలేటి వెంకటేశు, ఉత్తన్న, బద్రీనాథ్, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.



## వాహనదారులు తప్పనిసరిగా

# లైసెన్స్ కలిగి ఉండాలి



వేంపల్లె: జూన్ 05 ప్రభాతవార్త

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్సై తిరుపాల్ నాయక్ సూచించారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో, పోలీస్ సిబ్బందితో కలిసి ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధించారు. అనంతరం ఎస్సై తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అలాగే సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. ఇంటి నుంచి బయటకు వచ్చే ప్రతి సందర్భంలో హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణ రక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సాయిబాబా, హోంగార్డు శివశంకర్ డ్రైవర్ వెంకటేష్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరు వెంకటరామిరెడ్డి

పులివెందుల, జూన్ 5 , ప్రభాత వార్త :

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరు వెంకటరామిరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పులివెందుల మున్సిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, గ్రామస్థులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మద్దూరు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో చెట్ల పెంపకం అత్యంత అవసరమని తెలిపారు. మొక్కలు మనకు ప్రాణవాయువును అందించడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణంలో వివిధ రకాల నీడనిచ్చే, పండ్ల మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను విద్యార్థులకు అప్పగించారు. విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాల్సిన అవసరం ఉందని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న మద్దూరు వెంకటరామిరెడ్డి

## ప్రభుత్వాసుపత్రి శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది సమస్యలు తీర్చాలి



ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 5, ప్రభాతవార్త

రాష్ట్ర సమితి పిలుపుమేరకు శుక్రవారం ఏఐటియుసి అనుబంధ సన్ఘ ఏ.పీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ స్థానిక జిల్లా ఆస్పత్రి ప్రొద్దుటూరు నందు ఆస్పత్రి శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డ్స్ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏఐటియుసి జిల్లా నాయకులు హరి ముఖ్యఅతిథిగా పాల్గొని జిల్లా ఆస్పత్రి శానిటేషన్ సిబ్బందికి సరైన సమయంలో జీతాలు అందక రవాణా చార్జీలు కూడా డబ్బులు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అలాగే కరెంటు బిల్లు, ఇంటి అద్దె, పిల్లలు చదువులు ఇంటి ఖర్చు భరించలేక అధిక వడ్డీలకు తల డిల్లిపోతున్నారు. పెంచిన ఎంఒయు ప్రకారం 13960 రూపాయలు జీతాలు సరైన సమయానికి ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నామని, అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని సిబ్బంది మాత్రం చాలా సమస్యలతో బాధపడుతున్నారని ఇచ్చే ఆరు కొర వేతనం కూడా సరైన సమయానికి ఇవ్వడం లేదని ఏజెన్సీ నిర్వాహకులు ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించకపోవడం ఉద్యోగ భద్రత లేకపోవడం 50 సంవత్సరాలు నిండిన వారిని తొలగిస్తామని, ప్రశ్నించిన వారిని ఎప్పుడూ తొలగిస్తారో తెలియనీ పరిస్థితి పిఎఫ్, ఈఎస్ఐ ల ఎంప్లాయు, ఎంప్లాయర్ రెండు షేర్లను కార్మికులు వేతనం నుంచి కట్ చేస్తున్న విషయాన్ని ఎత్తి చూపారని కొంతమంది కార్మికులు సక్రమంగా చెల్లించడం లేదనే నేపథ్యంలో ఔట్సోర్సింగ్ వ్యవస్థను రద్దుచేసి ప్రభుత్వమే నేరుగా వేతనాలు ఇవ్వాలని, కార్మికులకు కొత్త యంవోయు ప్రకారం 2026 జనవరి నుంచి వేతనాలు 12,400 నుంచి పెంచి 13,960 రూపాయలు ఇవ్వాల్సి ఉండగా దానిని తగ్గించి ఏజెన్సీ నిర్వాహకులు 11,700 కొన్నిచోట్ల 13,000 ఏజెన్సీ నిర్వాహకులు ఇష్టానుసారంగా చెల్లిస్తున్నా అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని కాబట్టి వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే కూటమి ప్రభుత్వానికి భవిష్యత్ పోరాటాలకు సిద్ధమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చెన్నమ్మ, ప్రమీలమ్మ, నాగమ్మ, యశోదమ్మ నారాయణమ్మ ఓబులమ్మ సాలమ్మ కనకమ్మ జయమ్మ, లక్షి మ్మ, శ్రీకళ, సత్య, రాజమ్మ, సుబ్బమ్మ, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రత్యేక యాప్ ద్వారా యూరియా, డిఏపి పంపిణీ

దువ్వూరు, జూన్ 05, ప్రభాతవార్త:

వచ్చే ఖరీఫ్ సీజన్లో రైతులకు అవసరమైన యూరియా, డిఏపి ఎరువులను ప్రత్యేక యాప్ ద్వారా రైతులకు అందజేస్తారని, ఈ విషయాన్ని రైతులందరూ గమనించాలని మండల వ్యవసాయ అధికారి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు దువ్వూరు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఎంపీపీ కానాల జయచంద్రా రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ కు గాను వ్యవసాయ ప్రణాళికలు సిద్ధం చేశామని మొత్తం 4974 మెట్రిక్ టన్నులు రసాయనిక ఎరువులు అవసరం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో యూరియా 2075, డిఏపి 929 టన్నులు అవసరం ఉంటుందన్నారు. ఇందుకుగాను ఈ ఖరీఫ్ సీజన్లో ప్రభుత్వం ప్రత్యేక యాప్ ద్వారా పంపిణీ చేస్తుందన్నారు. అలాగే రైతులందరూ ఫార్మర్ ఐడి నెంబర్ ను ఖచ్చితంగా తీసుకోవాలన్నారు. ఈనెల 12, 13వ తేదీలలో రైతు పండుగ అనే కార్యక్రమం జరుగుతుందని రైతులందరూ పాల్గొనాలని అన్నారు. అనంతరం విద్యాశాఖ పై ఎంఈఓ రమణయ్య మాట్లాడుతూ 202627వ సంవత్సరానికి గాను ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకుగాను బడి పండుగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 14074 పాఠ్య పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ శాఖ తరపున కుమార్ రాజా మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వర్షాలు, గాలుల వల్ల 15 లక్షల రూపాయల నష్టం జరిగిందని ప్రస్తుతం అన్ని గ్రామాలలో రిపేర్లు పూర్తి చేసి విద్యుత్ సరఫరా అందజేస్తున్నట్లు తెలిపారు. ఇంకా రైతులకు కొన్ని చోట్ల విద్యుత్ ఇవ్వవలసి ఉందని ఆ పనులను కూడా త్వరగా పూర్తి చేస్తామన్నారు. వైద్యాధికారి డాక్టర్ హేమలత మాట్లాడుతూ త్వరలో పలచ పోలియో కార్యక్రమం జరుగుతుందని దానిని విజయవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది లక్ష 8వేల 79 మందికి ఉపాధి కల్పించామని పేర్కొన్నారు. అలాగే 6 కోట్ల 50 లక్షలు మెటీరియల్ పనులు వర్క్ లో చెల్లించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలకు సబ్సిడీతో కూడిన ప్రోత్సాహకాలు ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని ఏపీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. హౌసింగ్ డిఈ రమేష్ మాట్లాడుతూ మండలానికి 1099 పక్కా గృహాలు మంజూరు అయ్యాయని వాటిని త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. గ్రామాలలో మంచినీటి సమస్య, పారిశుధ్యం పై అందరూ స్పందించాలని ఎంపీపీ కానాల జయచంద్రా రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



## మంచినీటి సమస్యకు ప్రాధాన్యత ఇవ్వాలి



దువ్వూరు, జూన్ 5, ప్రభాతవార్త:

మండలంలోని 23 గ్రామపంచాయతీల్లో వేసవికాలం అయినందున ఎక్కడ మంచినీటి సమస్య రాకుండా చూడవలసిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని ఎంపీడీవో సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లచే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వేసవికాలం అయినందున బోర్లలో నీటిమట్టం తగ్గి ఉంటుందని వెంటనే పైపులు వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎక్కడైనా మోటార్లు కాలిపోతే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఉంటూ మంచినీటి సమస్యకు, పారిశుద్ధానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఈవోపీఆర్టి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో ముందస్తు

# వ్యాధి నివారణ చర్యలు

దువ్వూరు, జూన్ 05, ప్రభాతవార్త:

వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా వసతి గృహాల్లో ముందస్తు వ్యాధి నివారణ చర్యలు చేపట్టినట్లు క్లినిక్ అధికారి నరసింహా రెడ్డి తెలిపారు. శుక్రవారం పుల్లారెడ్డిపేట లోని కస్తూరిబా విద్యాలయం ఎస్సీ హాస్టల్లో దోమల నివారణ కోసం ఆల్ఫా సైఫర్ మిథిన్ 5 అనే రసాయనిక మందుని పిచికారి చేశామన్నారు. వసతి గృహాల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉంటారని అందువల్ల ఒకరి నుండి మరొకరికి మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. దీనిని అరికట్టేందుకు గాను ఈ మందును పిచికారి చేశామన్నారు. దోమలు, నల్లులు ఇతర కీటకాలను నివారిస్తుందని పేర్కొన్నారు. పరిసరాలు పరిశుభ్రతను ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజగోపాల్, వీరాంజనేయులు, జనార్ధన్ రావు, రవికుమార్, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## భూ వివాదం కేసులో పోలీసుల వేధిస్తున్నారని బాధితురాలి ఆవేదన

పులివెందుల, జూన్ 5, ప్రభాతవార్త :

పులివెందుల మండలం ఉల్లిమెల్ల గ్రామంలో భూ వివాదం కేసులో తన భర్త గోవర్ధన్ రెడ్డిని పోలీసులు వేధించారని ఆరోపిస్తూ బాధితురాలు శివలక్ష్మి మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఆర్ అండ్ బీ భవన సమీపంలో నీ రోడ్డు వద్ద మీడియా తో ఆమె మాట్లాడుతూ ఉల్లిమెల్ల గ్రామంలో భూ వివాదం గత మూడు సంవత్సరాలుగా కొనసాగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసుల పిలుపు మేరకు తన భర్త స్టేషన్‌కు వెళ్లి విచారణకు సహకరించినప్పటికీ, కేసు నమోదు చేయకుండా రెండు రోజుల పాటు పోలీస్ స్టేషన్‌లో ఉంచారని ఆరోపించారు. అంతేకాకుండా స్టేషన్‌లో తన భర్తపై దాడి చేసి రక్తగాయాలు అయ్యేలా కొట్టారని, ఈ విషయాన్ని తన భర్త ఫోన్ ద్వారా తెలియజేశాడని శివలక్ష్మి పేర్కొన్నారు. సివిల్ స్వభావం కలిగిన భూ వివాదంలో పోలీసులు ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని ప్రశ్నించారు. పులివెందుల అర్బన్ సీఐ శ్రీరామ్ తన భర్తను బెల్టుతో కొట్టి, తలను గోడకు కొట్టారని ఆమె ఆరోపించారు. అలాగే రెండు రోజుల పాటు తన భర్తను స్టేషన్‌లో ఉంచడంతో అతడిని కలిసేందుకు వెళ్లగా, "మీరు బయటకు వెళ్లండి, లేకపోతే మీ వీడియో తీసి కేసు నమోదు చేస్తాను" అంటూ సీఐ శ్రీరామ్ తనతో అనుచితంగా ప్రవర్తించారని తెలిపారు. తన భర్తకు జరిగిన అన్యాయంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని శివలక్ష్మి కోరారు.



# మొక్కలు నాటండి పచ్చదనాన్ని పెంచండి

సిద్ధవటం జూన్ 5 ప్రభాతవార్త

పచ్చదనాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంపకం చేపట్టాలని 11 వ పోలీస్ పటాలయం కమాండెంట్ ఆనంద్ రెడ్డి పేర్కొన్నారు మండలంలోని భాకరాపేట గ్రామ సమీపాన ఉన్న 11వ ఏపీఎస్పీ పోలీస్ పటాలయంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు పంపిణీ చేపట్టారు ఈ సందర్భంగా కమాండెంట్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పచ్చదనాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన తెలిపారు కాలుష్యాన్ని నివారణ కొరకై మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని తెలిపారు సిద్ధవటం అటవీ క్షేత్ర అధికారి కళావతి మాట్లాడుతూ అటవీ ప్రాంతాలలో వర్షాలు పడ్డాక విత్తన బంది కార్యక్రమాలు మొదలుపెట్టి అటవీ ప్రాంతాలలో పచ్చదనాన్ని పెంచేందుకు వివిధ ఔషధ మొక్కలు కలిగిన విత్తనాలు మెత్తటి భాగంలో చల్లుతామని కొండ ప్రాంతాలు పచ్చదనంతో ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్ కమాండెడ్



ఆనంద్ రెడ్డి ఫారెస్ట్ రేంజర్ కళావతి అసిస్టెంట్ కమాండెడ్, రాజశేఖర్, వెంకటప్ప, డిప్యూటీ రేంజర్, ముక్తార్ భాష, బెటాలియన్ , పోలీసులు,ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా

# అవగాహన కార్యక్రమం

బద్వేలు అర్బన్, జూన్ 5, ప్రభాతవార్త

ప్రపంచ పర్యావరణ దినోత్సవం2026 సందర్భంగా బద్వేలు రేంజ్ అటవీశాఖ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సహకారంతో గోపవరం మండలం శ్రీనివాసపురంలోని శ్రీ రాజమ్మ నాగభూషణం జెడ్పీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాలు, అటవీ సంపద ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర జీవ వైవిధ్య మండలి ప్రతినిధి భాషర్ వల్లి, రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ నయీమ్ అలీ, ఎంపీడీఓ శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

# చెరువులో కంపచెట్లు తొలగింపు



ఒంటిమిట్ట జూన్.05,(ప్రభాతవార్త

ఒంటిమిట్ట మండలం గంగ పేరూరు చెరువులో కంపచెట్లు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో శుక్రవారం స్థానికులు ఎంపీడీవో సుజాత ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో తొలగించి శుభ్రపరచడం జరిగింది. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ జగన్ మోహన్ రాజు ఆదేశాల ప్రకారం చెట్లను తొలగించడం జరిగిందని కార్యకర్తలు తెలిపారు. ఈ సందర్భంగా ఎండీఓ సుజాత మాట్లాడుతూ చెరువు శుభ్రపరచడం కోసం 5 లక్షల రూపాయలు నిధులు మంజూరు కావడంతో ఆ నిధుల సహాయంతో జెసిబి తో కంప చెట్లను తొలగించి శుభ్రపరచడం జరిగిందన్నారు . చెరువులో కంప చెట్లు ఎక్కువగా ఉండటంతో నీటి నిల్వ తగ్గడం చేత రైతులు పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెట్లు తొలగింపు ద్వారా చెరువు సామర్థ్యం పెరిగి నీటి నిల్వకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయన్నారు. మండలంలోని చెరువుల పునరుద్ధరణ ద్వారా రైతాంగం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చెరువు అధ్యక్షుడు వెంకటరమణ., కొత్తపల్లి .బొట్టిలి రాయుడు, ఇంజనీరింగ్ అధికారి లలిత్, సచివాలయ కార్యదర్శి సౌజన్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల

# పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి



ప్రజల సమస్యలను వింటున్న బీటెక్ రవి

పులివెందుల, జూన్ 5 , ప్రభాతవార్త :

ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజా శ్రేయస్సుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని తెలుగుదేశం పార్టీ నేత బీటెక్ రవి అన్నారు. శుక్రవారం పులివెందులలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో ఆయన నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను కలిసి వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించిన బీటెక్ రవి, సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్న ఆయన, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కల నాటడం

ముద్దనూరు, జూన్ 05 ప్రభాతవార్త:

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆసుపత్రి ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె. ఓబులేసు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సి. శ్రీనివాస్ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. చెట్లు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి, భూగర్భ జలాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను నియంత్రించడంతో పాటు జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో చెట్లు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కరిష్మా, అటవీ శాఖ సిబ్బంది, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొని మొక్కలు నాటడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని అధికారులు పిలుపునిచ్చారు.



# పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని రాస్తారోకో

- అడ్డుకొని అరెస్టు చేసిన పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 5, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరులోని టీబీ రోడ్డులో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో పెట్రోలు, డీజిల్, నిత్యావసర తస్తువుల ధరలు తగ్గించాలని రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు రాస్తారోకోను అడ్డుకొని పలువురిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ 3వ సారి అధికారం కొనసాగిస్తూ ఈ మధ్య కాలంలో పెట్రోలు, డీజిల్‌పై ఒక లీటరుపై రూ.10 పెంచుతూ ప్రజల నడ్డి విరిచిందని ఈ పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడం వలన నిత్యావసర వస్తువులన్నీ పెరిగి ప్రజలకు భారం కానున్నాయని కొనుగోలు శక్తి పడిపోతున్నదన్నారు. ఈ నెల9న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కొనసాగిస్తున్నామని ప్రజలు ఈ భారాలను మోయలేకున్నారన్నారు. చైన్ లింకు మాదిరిగా అన్ని పెరుగుతున్నాయన్నారు. ఈ రాస్తారోకోలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు పకీరయ్య విజయకుమార్ 5వ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి ప్రేమ అధ్యక్షులు విజయకుమారి, డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, ఆటో యూనియన్ కార్యదర్శి గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేవిడ్, శేఖర్, సీపీఎం నాయకులు చెన్నారెడ్డి పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

వైవీయూ, జూన్ 04, ప్రభాతవార్త:

పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. విశ్వవిద్యాలయంలో ఎన్ ఎస్ ఎస్, ఎన్విరాన్మెంట్ సైన్స్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో "వరల్డ్ ఎన్వీరానమెంట్ డే" నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన పరిపాలన భవన ప్రాంగణంలో ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్, అధ్యాపకులు మొక్కలునాటి నీరు పోశారు. ఈ సందర్భంగా వీసీమాట్లాడుతూ వాతావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల విపరీతంగా ఎండలను ఇటీవలే మనం చవిచూశామన్నారు. వాతవరణ ఆవశ్యకతను తెలిపేలా మ్యాసివ్ ఓపెన్ ఆన్లైన్ కోర్స్ (మూక్స్), స్టడీ వెబ్ ఆఫ్ యాక్టీవ్ లెర్నింగ్ ఫర్ యంగ్ ఆస్పైరింగ్ మైండ్ (స్వయం) ప్లాట్ఫాంలో వైవీయూ తరఫున ఎన్విరాన్మెంట్ సైన్స్ ప్రత్యేక కోర్సు ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రస్థాయిలోనే కాకుండా దేశ స్థాయిలో ప్రతి ఒక్కరూ అధ్యయనం చేసేందుకు ఉపయుక్తమవుతుందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించే బాధ్యత కూడా మనం తీసుకోవాలన్నారు. ఎన్విరాన్మెంట్ సైన్స్ డిపార్ట్మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి చంద్రశేఖర్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం థీమ్ గురించి వివరించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ మనం రెండు భారీ పరివర్తనల సంగమస్థానంలో జీవిస్తున్నామని అవి




ఒకటి పునరుత్పాదక శక్తి రెండవది డేటా యుగం అన్నారు. ఈ రెండూ ఒకే సమయంలో జరగడమే కాదు, అవి ప్రాథమికంగా ఒకదానికొకటి శక్తిని అందిస్తున్నాయని తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని సీతాకోకచిలుకల పార్కులో డైరెక్టర్ డాక్టర్ ఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో వీసీ, ప్రిన్సిపల్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లోవై వి యు ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటరామిరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కే ఎస్ వి కృష్ణారావు, ప్రొఫెసర్ అనిత, డాక్టర్ కె. లలిత, డాక్టర్ కోటమృత్యుంజయరావు, అకడమిక్ కన్సల్టెంట్లు, విశ్వవిద్యాలయ ఆలుమ్నీ అసోసియేషన్ ప్రతినిధులు, స్కాలర్లు, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



బద్వేలు అర్బన్, జూన్ 5, ప్రభాతవార్త

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సురేంద్రనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ నాగరాజు శుక్రవారం సందర్శించి తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో అమలవుతున్న కార్యక్రమాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల నమోదు, ప్రతి వ్యక్తికి అభా ఐడీ సృష్టి, సంక్రమణ మరియు అసంక్రమణ వ్యాధుల సర్వేలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే 14 నుంచి 15 సంవత్సరాల బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్‌ను లక్ష్యంగా తీసుకుని అమలు చేయాలని సూచించారు. ఆసుపత్రులకు వచ్చే ప్రజలను స్నేహపూర్వకంగా స్వాగతించి, వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మల్లేష్, ఆర్బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ అర్పి, ఎపిడెమియాలజిస్ట్ ఖాజా, వైద్యులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శరత్ చంద్ర, డాక్టర్ శశివర్ధన్ రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిబాపూలే ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ప్రభుత్వం అవకాశం.

మైదుకూరు, జూన్ 05, ప్రభాతవార్త:

వైఎస్ఆర్ కడప జిల్లా,మైదుకూరు మండలం వనిపెంట నందు గల మహాత్మ జ్యోతిబాపూలే ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు) కళాశాలగా ప్రభుత్వం అవకాశం కల్పించింది. అందువల్ల పదో తరగతి రెగ్యులర్ గా చదివి ఉత్తీర్ణులైన బాలికల నుంచి ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాము. ఈ కళాశాలలో ఎంపీసీ,బైపీసీ గ్రూపులకు దరఖాస్తు చేయదలచిన అభ్యర్థులు ఈ నెల 8 వ తేదీ నుండి పదవ తరగతి డూప్లికేట్ మార్క్ లిస్ట్, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్ ఒక ఫోటోతో వచ్చి కళాశాల నందు అప్లికేషన్ పొంది అక్కడే నింపి కళాశాలలో సమర్పించవలెను. పాఠశాలను కళాశాలగా అప్గ్రేడ్ చేసినందుకు బి సి సంక్షేమ శాఖ మంత్రి వర్యులు సవిత, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సత్యనారాయణ వారికి, ఎం జె పి సొసైటీ కార్యదర్శి మాధవి లత మేడమ్,జిల్లా కన్వీనర్ రామ కృష్ణా రెడ్డి, ప్రిన్సిపాల్ నిర్మల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రతి ఒక్కరూ విధివిగా మొక్కలు నాటండి పర్యావరణాన్ని రక్షించండి

ప్రొద్దుటూరు, జూన్ 5, ప్రభాతవార్త

ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని రాష్ట్ర బిజెపి మహిళ మోర్చా మాజీ కోశాధికారి సివి జయలక్ష్మి బిజెపి పట్టణ అధ్యక్షులు వంకధార నరేంద్ర రావు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శనివారం ప్రొద్దుటూరు లోని రాజీవ్ సర్కిల్ నందు మొక్కల నాటే కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు ఎం. కుమారి, జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ భూమిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పరమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీశ్రీ, ఉపాధ్యక్షురాలు శ్రీమతి రెడ్డి ప్రసన్న, బీజేవైఎం జాతీయ నాయకులు యాదవ నరేష్ కుమార్ బీజేవైఎం మాజీ జిల్లా ఉపాధ్యక్షులు రవి తేజ కార్యదర్శి హరికృష్ణ, బీజేపీ సీనియర్ నాయకులు జ్యోతి, చలపతిరావు, రాగాల రమణయ్యతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పర్యావరణ దినోత్సవ వేడుకలు



మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్, జిల్లా మలేరియా అధికారి, సిబ్బంది

రాజంపేట, జూన్ 5 ప్రభాతవార్త

ప్రపంచ పర్యావరణ దినోత్సవం, మలేరియా వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. రాజంపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం,మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, ప్రజారోగ్యంపై అవగాహన కల్పించే వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. మన్నూరు, బలిజపల్లిలో ర్యాలీ నిర్వహించి మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా , మెదడు వాపు జ్వరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి వెంకటరెడ్డి మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రతి శుక్రవారం"ఫ్రైడే డ్రై డే" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నిల్వ నీరు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మున్సిపల్ కమిషనర్ ఎన్. లక్ష్మీ నారాయణ, డాక్టర్ దుర్గ మల్లేష్, డాక్టర్ సౌజన్య, డాక్టర్ లక్ష్మీ ప్రసన్న మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ సిబ్బంది, జిల్లా ఆరోగ్య విస్తరణ అధికారి బాలపుల్లయ్య, సబ్ యూనిట్ అధికారులు ఎస్.ఎస్. దాస్, ప్రసాద్, సూపర్వైజర్ చెన్నమ్మ, ఆరోగ్య సహాయకులు, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయకసంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్క నాటండి

మైదుకూరు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి,

మైదుకూరు, జూన్ 05, ప్రభాతవార్త:

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మైదుకూరు మున్సిపాలిటీ కమిషనర్ రంగస్వామి ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రకృతి మనకు జీవనాధారం, స్ఫూర్తి, భవిష్యత్తుకు మార్గదర్శకం. నేడు వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి" అని ఒక సందేశంలో పేర్కొన్నారు. మైదుకూరు పట్టణ వనిపెంట రోడ్డు ఎర్ర చెరువు కట్టపై, పరిసరాలలో మున్సిపాలిటీ సిబ్బందితో మొక్కలు నాటడం జరిగింది ఈ సందర్భంగా కమిషనర్ రంగస్వామి మాట్లాడుతూ ఒక మొక్క నాటడం, నీటిని ఆదా చేయడం, కాలుష్యాన్ని తగ్గించడం వంటి చిన్నచిన్న చర్యలే రేపటి తరాలకు సురక్షితమైన, స్వచ్ఛమైన భూమిని రాబోవు తరాలకు అందించగలవని పేర్కొన్నారు. కాలుష్య ఉద్గారాలను తగ్గించేందుకు విద్యుత్ వాహన వినియోగం, గ్రీన్ ఎనర్జీ దిశగా సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడం, అర్బన్ పార్కులు, చెరువుల పునరుద్ధరణతో ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు మున్సిపాలిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# మొక్కలు పెంచండి పర్యావరణాన్ని పరిరక్షించండి

ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 5, ప్రభాతవార్త

ప్రస్తుత పరిస్థితులలో వాతావరణ కాలుష్యంతో గ్లోబల్ వార్మింగ్ ద్వారా జరిగే దుష్పరిణామాలను అరికట్టవలసిన బాధ్యత అందరిపై ఉందని పురపాలిక మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. స్థానికమోడంపల్లి పురపాలక ఉర్దూ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఎఫ్ఎసి ప్రధానోపాధ్యాయులు మనోహర్ యాదవ్ ఆధ్వర్యంలో పర్యావరణ మిత్ర రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి సౌజన్యంతో ముఖ్య అతిథులుగా హాజరైన పురపాలక సంఘం ఇన్చార్జి కమిషనర్ శ్రీనివాస్ హస్తాలతో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వేప, కానుగ, సుంకేసుల,అఖిలిఫా 14 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని నేడు ఈ కార్యక్రమాన్ని నా చేతుల మీదుగా నిర్వహింపజేయడం అదృష్టంగా భావిస్తున్నానని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని కూడా నిరోధించే ప్రయత్నం చేయాలని అప్పుడే మనమందరము పర్యావరణ కాలుష్యం నుండి విముక్తులము కాగలుగుతామని తెలిపారు. గజ్జల వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ సృష్టిలోని సమస్త జీవరాశికి మూలం ఆధారం జీవనాధారం ప్రాణాధారం మొక్కలేనని ప్రతి ఒక్కరము మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను తీసుకుని భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని నా సొంత ఖర్చులతో ఇప్పటివరకు ఈ మొక్కలతో కలిపి 9014 మొక్కలను నాటించి సంరక్షింప చేయించడం జరిగిందని ఈ కార్యక్రమాన్ని నేను నిరంతరం కొనసాగిస్తానని తెలిపారు. ఎఫ్ఎసి ప్రధానోపాధ్యాయులు మనోహర్ మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరికీ ఉన్నదని ఆ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మన ప్రజా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మహమ్మద్ అయూబ్ ఖాన్, ఉపాధ్యాయులు ఎస్ కరీముల్లా,ఎస్ షేక్షావల్లి, ఎం శివ,మద్దిలేటి యాదవ్, కంప్యూటర్ ఆపరేటర్ రామాంజనేయులు, మున్సిపల్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



# చిన్నారుల పరిరక్షణ కోసం నవ చేతన

వేంపల్లె జూన్ 05 ప్రభాతవార్త

చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదలకు, ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయని వాటి పరిరక్షణ కోసం అంగన్వాడీల్లో నవ చేతన కార్యక్రమాలను శిశు సంక్షేమ శాఖ, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ ఆధ్వర్యంలో చేపట్టుతున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఓ సునీత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు నవ చేతన యాప్ రూప కల్పనపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ సునీత మాట్లాడుతూ చిన్నారుల సమగ్ర అభివృద్ధికై ప్రవేశపెట్టిన ఒక కీలకమైన బాల్యారంభ అభివృద్ధి కార్యక్రమం నవ చేతన యాప్ అన్నారు. గర్భధారణ సమయం నుంచి పిల్లలకు 6 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు వారి మెదడు ఎదుగుదలను మరియు శారీరక, మానసిక వికాసాన్ని పర్యవేక్షించడం యాప్ ముఖ్య ఉద్దేశం అన్నారు. పిల్లల ఎదుగుదలలో ఏవైనా లోపాలు లేదా ఆలస్యాలను ముందుగానే గుర్తించి, సరైన సమయంలో అవసరమైన వైద్య సహాయం అందించడానికి అంగన్వాడీ, ఆరోగ్య శాఖ కార్యకర్తలు మొబైల్ యాప్‌ను ఉపయోగిస్తున్నారని తెలిపారు. పిల్లలు సమగ్ర అభివృద్ధి సాధ్య మవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూర్వజ, ఐసిడిఎస్ సూపర్ వైజర్ స్వర్ణలత, హసీనా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.




# నేడు అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

పులివెందుల, జూన్ 5 , ప్రభాతవార్త :

భారతరత్న, మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నేడు పులివెందుల పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ,ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్, భాజాపా ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, కూటమి నాయకులు జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి బీటెక్ రవి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి తదితర ప్రముఖ నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ టెలికం కార్యాలయం సమీపంలో ఉన్న వాజ్‌పేయి సర్కిల్‌లో సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా దేశభక్తి, సుపరిపాలన, ప్రజాసేవకు ప్రతీకగా నిలిచిన వాజ్‌పేయికి నివాళుల ర్పించేందుకు ప్రతి భారత పౌరుడు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమితి సభ్యులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాజ్‌పేయి భారత దేశానికి మూడుసార్లు ప్రధాన మంత్రిగా సేవలందించి దేశ అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఆయన నాయకత్వంలో 1998లో జరిగిన పోఖ్రాన్ అణుపరీక్షలు దేశ ప్రతిష్ఠను ప్రపంచవ్యాప్తంగా చాటగా, కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం సాధించిన విజయానికి ఆయన ధైర్యవంతమైన నాయకత్వం బలంగా నిలిచింది.